# మొగిలి

-డా. వాసా ప్రభావతి

అప్పుడే తెల్లవారుతోంది. చీకటి సంద్రంలా వున్న లోకం పాల సంద్రంలా మారుతోంది. సుషుప్తావస్థలో వున్న ప్రాణికోటికి మేలుకొల్పులా ఆ యింటి ముందు సారె వేగంగా తిరుగుతూ ఏ వాయిద్యము మ్రోగించలేని ఓ కొత్త రాగం పలికిస్తోంది. అంత కంటే వేగంగా సారె ముందు కూర్చున్న మొగిలి ముంజేతి మీద గాజులు కదులుతూ సూర్య కిరణాలకే నగిషీలు చెక్కుతున్నాయి. పడుగుపేకల్లా అల్లుకుని ప్రకృతిలో ఓ అద్భుత శిల్ప దృశ్యాన్ని రూపు కట్టిస్తున్నాయి. ఆమె చేతుల మధ్యలో రూపుదిద్దుకుంటున్న మట్టి కూజాలతో మొగిలి ఈ కర్మ భూమిలో సృష్టికర్తను ప్రత్యక్షం చేస్తోంది.

ఆమెకు రెండు బారల దూరంలో కోటిగాడు రెండు కాళ్ళతో అడుసు తొక్కుతూ కూనిరాగాలు తీస్తున్నాడు. బురదలో కాళ్ళు బిగునుకుని కదలక మొరాయించినప్పుడు మట్టి పిడతతో నీళ్ళు జల్లుతూ మొగిలి తయారు చేసే పాత్రలకు మట్టిని పదును చేస్తున్నాడు.

ఆకాశంలో తిరుగుతున్న గెద్ద ఒకటి తల్లినంటి తిరుగుతున్న కోడి పిల్లను తన్నుకుపోవాలని మాటువేసి చూస్తోంది. పక్కనే పనిలేని కాట్ల కుక్కలు ఒకదాని మీద మరొకటి పడుతూ కొట్లాడుకుంటున్నాయి. అవేమి పట్టించుకోని మొగిలి తన పనిలో నిమగ్నమై చేసుకుంటోంది.

"మొగిలా! ఓ మొగిలా! ఇగ సాలునా! సేనా సేపయినాదే! అడుసు తొక్కి తొక్కి నా ముంగాల్లు రోల్లవుతున్నాయే? ఇటు సూడయే!" అంటు కోటిగాడు అరుపు ప్రారంభించాడు.

"ఏటి సూసేది? సూత్తున్నాగా! నా సేతులు సారె ఆపాలా? నీవు అడుసు తొక్కడం ఆపాలా! ఇగ అరవబోకు! పని సూసుకో?" మొగిలి సమాధానం విన్న కోటి ఆ పని చెయ్యడం విసుగ్గా ఉన్నా తిరిగి ప్రారంభించాడు. మొగిలి అంటె అతనికి అమితమైన ప్రేమ. ఆమె మాట కాదనలేడు.

"కోటప్పు కొండకెల్లాలా!

కావిడి బుజానకెత్తాలా

మొగిలి యెంట రావాలా?" కోటి లేని ఉత్సాహం తెచ్చుకుని పదం అందుకుని తిరిగి తన పనిలో లీనమయ్యాడు.

కోటి నోట తన పేరు వినగానే ఆమె మదిలో అనురాగ రేఖ తళుక్కుమని అది చిరునవ్వుగా ఆమె పెదవులపై తళతళలాడింది.

ఆ ముందు రోజు రాత్రే ఆ గ్రామం వచ్చిన వేణు స్నేహితుడు మాధవునితో ఊరు వెంట బయలుదేరాడు. వేణు పట్నంలో పుట్టాడు. పట్నంలో పెరిగాడు. పట్నంలోనే చదువుకుంటున్నాడు. మాధవ అతను ఇంజనీరింగు చేస్తున్నారు. ఇద్దరికి స్నేహం బాగా కుదిరింది. ప్రతిసారి శలవులకి తన వూరు రమ్మనమని మాధవ పట్టుపడుతున్నాడు. నాల్గవ ఏట పరీక్షలు కూడా పూర్తయ్యాయి. ఇక ఉద్యోగాలు వస్తే ఎవరు ఎటు వెడతారో తెలీదు. ఇక మాధవ మాట కాదనలేక వేణు అతని వెంట ఆ గ్రామం వచ్చాడు.

వేణు ఆ వీధులను, ఆ యిళ్ళను, ఆ జనాన్ని వింతగా చూస్తూ మాధవ వెంట నడుస్తున్నాడు. అప్పటికే వారు ఊరి చివర వరకు వచ్చేసారు. అక్కడ పాతగిల్లి, కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న పెంకుటిల్లు కనబడింది. ఆ యింటి ముందు సారె తిప్పుతూ కూర్చుని ఉన్న మొగిలిని చూసి ఆశ్చర్యపోయాడు. ఆమెను చూస్తూ అలాగే నిలబడిపోయాడు.

"అలా ఆగిపోయావేం వేణు! నడు, నడు" అంటూ మాధవ తొందరచేసినా వేణు ఆ మాటలు విననట్టే నిలబడిపోయాడు.

"మాధవా! ఆమె ప్రాణమున్న స్త్రీ మూర్తియా? లేక ఏ చిత్రకారుడో సృష్టించిన అపురూప చిత్రకళా ఖండమా?" వేణు ఆశ్చర్యంగా అడిగాడు.

"ఏం వేణు! కొత్తగా కవిత్వం పుట్టుకొస్తుందేమిటి నాయనా? ఏ చిత్రకారుడూ సృష్టించిన చిత్రం కాదది. మనలాగే ప్రాణమున్న ఓ నారీరూపం. మానవుడు సృష్టికర్తయే రూపుదిద్దుకున్న సజీవ దృశ్యమది. కాయకష్టంతో బతికే ఓ మనిషి జీవయాత్రా దృశ్యమది" అన్నాడు మాధవ నవ్వుతూ!

"అంటే?" పూర్తిగా అర్థంకాని వేణు తిరిగి అడిగాడు.

"పిచ్చి వేణూ? అంటే ఏముంది? ఆమె కుండలు, కూజాలు, ప్రమిదలు, పిడతలు, ఒకటేమిటి? మట్టితో తయారు చేయగల పాత్రలన్నీ తయారు చేస్తోంది? నువ్వు 'హైటెక్' యుగమనుకుంటే ఆమె ఇంకా కుండల యుగమనుకుంటోంది? అంతే?" అన్నాడు మాధవ పకపకా నవ్వుతూ!

"నవ్వు ఆపు మాధవా? నాకంతా అయోమయంగా ఉంది? నే నమ్మలేకపోతున్నా" అన్నాడు వింతగా ఆమె వైపు చూస్తూ.

"వేణూ? నమ్మక ఏం చేస్తావు? ఇది యధార్థం! కంటి ముందు కనబడే ఓ ప్రత్యక్ష సాక్ష్యం కదా! ఇంకా పెళ్ళిళ్ళకి, పేరంటాలకీ, నోములకి, వ్రతాలకీ, పండుగలకు, పబ్బాలకి, పుట్టుకలకు, చావులకు కూడా ఆ మట్టి పాత్రలతోనే పని కదా! పైగా ఈ పల్లెల్లో నీరు నిల్వకి, చల్ల నీళ్ళకి, పచ్చళ్ళు పెట్టుకోడానికి, వంటలకు, చివరకు చావులకు కూడా మట్టిపాత్రలే ఆధారం కదా! అందుకనే ఇంకా ఇక్కడ ఆ కుండల యుగమే కదా!" మాధవ వివరంగా చెప్పాడు.

"మరి ఆ పక్కన అతను ఆ బురదలో కోతిలా గంతులేస్తున్నాడెందుకు?" వేణు అతనివైపు చూపిస్తూ అడిగి పకపకా నవ్వాడు.

"అయ్యో వేణూ! కంప్యూటర్ ముందు కూర్చుని నువ్వు ప్రపంచం నడిపిస్తున్నా ననుకుంటున్నావు? కాని నువ్వు అసలు ప్రపంచాన్ని ఇప్పుడు చూస్తున్నావు? అతను ఆ మట్టి పాత్రల తయారీకి మట్టి పదును చేస్తున్నాడు? ఆ మట్టి లేందే ఆ పాత్రలే లేవు? ఇంక నడు! నడు!" అంటూ తిరిగి తొందర చేసాడు.

మాధవ మాటలు పూర్తయ్యేటప్పటికి వేణు భుజాన వేలాడుతున్న కెమెరాతో రెండు, మూడుసార్లు క్లిక్‌మనిపించాడు.

"వేణూ! ఈ పల్లెలో అలా నీ యిష్టమొచ్చినట్లు ఫోటోలు తియ్యకూడదు? పైగా ఆమె ప్రాణమున్న ఓ కన్నె పిల్ల? జాగ్రత్త" అన్నాడు ముందు జాగ్రత్తగా.

కోటి ఫోటోలు తీస్తున్న వేణు వైపు గుర్రుగా చూసాడు. వేణు స్నేహితుని మాట వినక మరోసారి కెమేరా క్లిక్‌మనిపించాడు. కోపం పట్టలేని కోటి గుప్పెడు బురద తీసి వేణు మీదికి విసిరాడు. అది వచ్చి వేణు తెల్లటి లాల్చీ మీద పడింది. అర్థం కాని వేణు అతనివైపు మరింత ఆశ్చర్యంగా చూసాడు. అంతలో కోటి మరోసారి

## చెల్లని డాలర్

ఉన్నంతలో వెన్నెలల్ని పండించుకొంటూ
కళ్ళ ముందు తిరిగే చందమామల్ని కాదని
అనంత శూన్యాల సంయుక్త రోదసిలోని
దశమ గ్రహాల కోసం దేవులాడే దానయ్యలకు
వివాహమెప్పుడూ ఓ విదేశీ వ్యాపారమే!
కన్యాదానం ఖరీదైన ఎగుమతి బేరమే!!
పారిస్‌లో ఫ్లైటాగినప్పుడు
సరదాగా సిగరెట్ తాగుతూ షాపింగ్‌కి వెళ్ళినట్టు
సహచరి వేటకై స్వదేశీ పర్యటనకొచ్చే వాడికి
వ్యక్తిత్వం కంటే కన్యాత్వం మీదే ఎక్కువ గురి
చక్కదనం కంటే సంపాదించే చదువుల గూర్చే
ఎంక్వయిరి
పరచుకొన్న పది రకాల ఫలహార రుచుల మధ్య
అమ్మాయి అభిరుచులు అడుగంటిపోతాయి!
సంప్రదాయకంగా సంక్రమించిన సిగ్గునైనా
ప్రదర్శించకముందే
నిస్సిగ్గుగా వేలంపాట హోరెత్తిపోతుంది!
అబ్బాయిది అంతర్జాతీయ మార్కెట్ గదా మరి
ముఖవిలువ శూన్యమైనా
ప్రీమియం మాత్రం పేలిపోతూంటుంది!
బంగారాన్నంతా పిండి వాడి ముంగిట పోసేసరికి
పుత్తడి బొమ్మ కాస్తా ఇత్తడి పళ్ళెమై మిగిలిపోతుంది!!
కలిసొచ్చిన ఖరీదైన సంబంధమంటూ కనపడ్డ వాడల్లా
కూసేసరికి
శక్తికి మించిన స్థాయిలో పుస్తెల మేళం మోగించేస్తారు
అప్పగింతల తంతు ఆఖరి అప్పుతో ముగించేస్తారు!
అంచనాలు తారుమారై
అమ్మాయి నెక్కించింది పూలపల్లకి కాదు పుష్పక
విమానమని తెలిశాక
సరిదిద్దుకోలేని పొరపాటు సరిహద్దులు దాటి
పోయియుంటుంది!
వంశాంకురాలతో పచ్చగా ఎదుగుతుందనుకొన్న
నూరేళ్ళ పంట
కల్తీ విత్తన కాటుకు గుర్రై కన్నీళ్ళను గంపకెత్తుకొస్తుంది!
వీసా సంబంధమనగానే
వేలం వెర్రిగా ఎగబడుతున్న దద్దమ్మా నాన్నలారా
తాంబూలాలిచ్చే ముందు తస్మాత్ తస్మాత్ జాగ్రత్త
మేరేజెస్ ఆర్ మేడిన్ ఫారెన్
డేమేజెస్ ఆర్ డనిన్ హెవెన్!!

-గేరా

బురద చేత్తో తీసి వేణు మీదికి విసరబోయాడు.

"కోటి! ఆగు! ఆగు!" అంటూ మాధవ గట్టిగా అరిచాడు.

ఆ అరుపుకి ఉలిక్కిపడ్డ మొగిలి తలెత్తిచూసింది. ఎదురుగా ఇద్దరు మగవారు.

"తమరా మాధవబాబు? ఈడకు వచ్చినారేటి?" చేతిలోని సారె ఆపి అడిగింది మొగిలి.

"ఇతను వేణు! నా స్నేహితుడు! మనూరు చూద్దానికి వచ్చాడు!" అన్నాడు.

"అయ్! అట్టాగాండీ!" అంది ఆప్యాయంగా మాధవ వైపు చూస్తూ.

కోటి వైపు కళ్ళెర్ర చేసి చూసింది. కోటి ఆమె చూపులు తట్టుకోలేక చేతిలో ఉన్న బురద తీసి కింద పడేసాడు.

"ఆరి సొక్కా పాడై పోనాది?" అంది బాధగా.

"మొగిలీ! నువ్వేం బాధపడకు. మా వల్ల నీ పని ఆగిపోయింది!" అంటు మాధవ "నడు! నడు!" అంటూ వేణు చెయ్యి పట్టుకుని ముందుకు కదిలాడు.

ఊరు దాటితే చుట్టూ పంట పొలాలే. పచ్చని ఆ పైరుల మీద రకరకాల పక్షులు వాలి ముక్కులతో గింజలు కరుచుకుపోతూ పరుగులెత్తుతున్నాయి. ఆ దృశ్యాలు చూసి వేణు సంతోషంతో పసివానిలా గంతులేస్తూ ఫోటోలు తీసాడు. అంతలో ఇద్దరు గోదావరి గట్టు ఎక్కారు.

తాటి మానును ముక్కుతో కొడుతూ రంధ్రం చేస్తున్న పిట్టను వేణు మరింత ఆశ్చర్యంగా చూసాడు.

"అది వడ్రంగి పిట్ట. దాని తెలివి చూసావా? గుడ్లు పెట్టడానికి ఏకంగా తాటి మానుకే రంధ్రం చేసి గూటిని తయారు చేసుకోవాలనుకుంటోంది? ఈ ప్రకృతినంతా సొంతం చేసుకోవాలనుకుంటాయి ఈ పక్షులు" అన్నాడు మాధవ.

అంతలో యమ ధర్మరాజు చిన్న కొడుకులా ఒక పిల్లాడు నల్లని గేదె మీద ఎక్కి స్వారీ చేస్తూ "తందనాన తానా!" అంటూ పాడుకుంటున్నాడు.

వేణు మరింత ఆశ్చర్యంగా ఆ దృశ్యాలను ఫోటోలు తీసాడు.

"ఇన్ని ఫోటోలు తీసావు? ఏం చేస్తావు? వేణూ?" మాధవ అడిగాడు.

"పోటీలకు పంపిస్తాను. ఇది వరకు పోటీలకి ఎన్ని ఫోటోలు పంపినా నాకు ఏ బహుమతి రాలేదు? ఈసారి తప్పకుండా వస్తుందని నా నమ్మకం!" అన్నాడు ఆశగా వేణు.

మాధవకి తండ్రిలేడు. తల్లి, అన్న, వదిన ఇంట్లో ఉంటారు. మాధవతో పాటే వేణుని కూడా వాళ్ళు ఆప్యాయంగా చూస్తున్నారు.

జాము పొద్దెక్కి ఎండ చురుక్కుమంటున్నా మొగిలి సారె ముందు కూర్చునే ఉంది. ముందురోజు పక్కూరి సంతకు మట్టిపాత్రల కావడితో వెళ్ళిన మల్లన్న తిరిగి వచ్చాడు.

"ఏటయినాదే మొగిలా! జాము పొద్దెక్కినాది? ఇంకా ఆడనే కూకున్నావేటి? ఈ పొద్దు అయిగారి ఇంటికాడ అమ్మాయి గారి మనువు గందా! ఇక సారె ఆపి లెగు! లెగు" అన్నాడు.

"అన్నీ! ఆడ యెట్టేనా!" అంటూనే మొగిలి సారె ఆపి •లేచింది.

"అదేందిరా! కోటిగా! సుక్కు పొడిసిన యేల అడసులో కాలెట్టినావు? కూడు తినవా యేటి? ఇగ లెగు? లెగు?" అంటూనే మల్లన్న భుజం మీది కావడి దించి పక్కగా పెట్టాడు.

"ఇగ అయిపోనాది మావా?" అంటు కోటిగాడు అడుసులోంచి కాళ్ళు తీసి బురద కడుక్కోడానికి నీటి బానలవైపు కదిలాడు.

మొగిలికి మూడేళ్ళు నిండకుండానే తల్లి వాతం కమ్మి చనిపోయింది. అప్పటి నుంచి మల్లన్న తల్లీ, తండ్రీ తానై మొగిలిని పెంచి పెద్ద చేసాడు. యుక్త వయస్సు వచ్చిన మొగిలే ఇప్పుడా యింటికి పెద్ద దిక్కు. సహజంగా తెలివి, చురుకుతనం గల మొగిలి అంటే ఆ తండ్రికి పంచప్రాణాలు.

కోటి మల్లన్న చెల్లెలు కొడుకు. మగడు చనిపోయిన ఆమె అన్న ఇల్లు చేరుకుంది. ఆమె పక్షవాతం వచ్చి చనిపోతూ పది సంవత్సరాల కోటప్పను అన్నకు అప్పచెప్పింది. కోటప్పు పెద్ద తెలివైన వాడు కాదు. పైగా పుట్టినప్పుడే పోలియో రావడం వల్ల ఒక కాలు కుంటి కూడా! అయినా చెప్పిన పని శ్రద్ధగా చేసుకుపోతాడు. అందుకే అతనంటె మల్లన్నకు అభిమానం. పైగా తల్లీ, తండ్రీ లేని అతనంటే చాలా యిష్టం కూడా! తన కూతురు మొగిలికి, కోటప్పనిచ్చి పెళ్ళి చేసి తన కళ్ళ ముందుంచుకోవాలని అతని ఆశ. ఆ కోటప్పే కోటిగాడుగా అందరి నోళ్ళల్లో ఉన్నాడు.

ఆ సాయంకాలం వేణు, స్నేహితునితో చెప్పకుండానే కెమేరా తీసుకుని మొగిలి ఇంటివైపు వెళ్ళాడు. ఆ యింటి వాకిట్లో ఓ వారగా కుమ్మరంలో కాలుతున్న ఆ మట్టి పాత్రలను చూస్తూ నిలబడి ఉంది మొగిలి. ఆ మంటల పక్క ఎర్రబడ్డ ముఖంతో భద్రకాళిలా ఉన్న మొగిలిని చూసి కాస్త జంకాడు వేణు. అతనిని చూసిన మొగిలికి పొద్దుట చూసిన జ్ఞాపకం వచ్చింది.

"ఏం కావాలయ్యా?" అంటూ అడిగింది.

"ఒక్క ఫోటో తీసుకుంటా" అంటూ వేణు కెమెరావైపు చూపించాడు.

మొగిలికి కెమెరా చూడగానే అర్థమయింది. ఆ వూళ్ళో పెద్దల ఇళ్ళల్లో పెళ్ళిళ్ళు అయినప్పుడు ఆ ఫోటో డబ్బా వస్తుంది.

"పొద్దుగాల తీసినావుగా! ఇగ సాలు బాబూ! ఇగ తీబోక" అంది.

అంతలో కోటిగాడు అక్కడకు వచ్చాడు. మొగిలి లోపలికి వెళ్ళిపోయింది. పొద్దుట కోటి చెయ్యివాటం చవిచూసిన వేణు భయంతో వెనుతిరిగాడు.

ఆ విషయం గమనించిన మాధవకి వేణు పద్ధతి నచ్చలేదు.

"ఈ వూరు వచ్చింది ఆ పిల్ల ఫోటోలు తియ్యడానికేనా? దేనికైనా అతి పనికిరాదు వేణూ?" ఆ రాత్రి మాధవ స్నేహితుణ్ణి మెత్తగా మందలించాడు.

"ఏదో సరదాకి ఫోటోలు తియ్యాలనుకుంటే తప్పేమిటి మాధవా?" అన్నాడు వేణు నవ్వుతూ.

"అది కాదు వేణూ. ఇది పల్లె! పెళ్ళి కాని ఆ పిల్ల ఫోటోలు అలా తీస్తుంటే వాళ్ళు తన్నడానికైనా వెనుకంజ వెయ్యరు జాగ్రత్త!" అంటూ మాధవ అతన్ని కాస్త భయపెట్టడానికి ప్రయత్నించాడు. మాధవకు ఏ సమాధానం చెప్పని వేణు కళ్ళు మూసుకున్నాడు. ఆ రాత్రి వేణు కలల నిండా మొగిలి రూపే నిలిచింది.

అతనికి కలత నిద్రతోనే తెల్లవారింది. కెమేరా చేత పట్టి మొగిలిని వెతుక్కుంటూ వేణు తిరిగి బయలుదేరాడు.

ఇంటి ముందు కళాపు జల్లి ముగ్గు పెడుతున్న మొగిలి తిరిగి వేణుని చూసి విస్తుపోయింది. ఆమెకు ఎవరేనా చూస్తారేమోనని భయం కూడా వేసింది.

"పట్నం బాబూ! ఏలకాని ఏల రాబోకే? మా పెద్దోల్లు సూసినారంటే ఏందో అంటారు? ఇగరాబోకే? యెల్లిపో?" అంటూ మొగిలి వేగంగా అడుగులేస్తూ ఇంట్లోకి వెళ్ళి తలుపు మూసేసింది.

వేణుకి ఆశపోలేదు. ఇంకా అలాగే నిలబడి ఆ గుమ్మంవైపు చూస్తున్నాడు. ఇంకా అతను వెళ్ళాడో లేదోనని తలుపు కొంచెం తెరిచి చూసింది. పచ్చని రంగుతో, అందమైన నల్లని క్రాఫుతో తెల్లని బట్టలతో మిసమిసలాడుతున్న అతన్ని చూడగానే ఆమె బింకం కరిగిపోయింది. పైగా వయసులో ఉన్న ఆమె మనసులో ఏవో కొత్త రాగాలు శృతులు చేసాయి. అయినా తండ్రి చాటు బిడ్డగా మొగిలి మనసును అదుపు చేసుకుంది. బలవంతంగా తిరిగి తలుపు మూసింది. అంతలో పనిమీద వెళ్ళిన కోటి ఇంటికి తిరిగివస్తూ వేణుని చూసాడు. "ఇంకా ఆడ ఉన్నావేటి? ఇగ పో! పో!" అంటూ అరిచాడు కోటి. ఆ అరుపు విని భయపడ్డ వేణు దిగాలుపడ్డ ముఖంతో ఇల్లు చేరుకున్నాడు.

వాడిపోయిన అతని ముఖం చూసి అక్కడ ఏదో జరిగిందని ఇట్టే ఊహించుకున్నాడు మాధవ. అయినా అడగలేదు.

"కెమేరాలో రీలు పూర్తయింది మాధవా? కడిగించాలి?" అన్నాడు వేణు.

"ఈ పల్లెలో అటువంటి సౌకర్యాలుండవు? పది మైళ్ళ దూరంలో పట్నం ఉంది. అక్కడకి వెళ్ళి కడిగించుకోవాలి?" సమాధానమిచ్చాడు మాధవ.

"మాధవా? కాస్త నాతో పట్నం వచ్చి పుణ్యం కట్టుకో?"

వేణు మాటలకి కరిగిపోయిన మాధవ అతన్ని తీసుకుని పట్నం బయలుదేరాడు.

కడిగిన ఫోటోలు చూసి వేణు తబ్బిబ్బైపోయాడు. అప్పటికే బాగా చీకటిపడింది.

"మాధవా? ముందు ఈ ఫోటో చూడు?" అంటూ మొగిలి ఫోటో అతని ముందు పెట్టబోయాడు.

"వేణూ! ఇవన్నీ ఇంటికెళ్ళాక చూద్దాం! ఈ బస్సు దాటిందంటే ఈ రాత్రి ఇక్కడే ఉండాలి? నడు! నడు!" అంటూ బస్సు స్టాండు వైపు అడుగువేసాడు. చేసేది లేక ఫోటోలు బాగ్‌లో సర్ది వేణు కూడా అడుగులేసాడు. ఇంటికి రాగానే వేణూ ఫోటోలన్నీ మాధవ ముందు పరిచాడు.

"సారె తిప్పుతున్న మొగిలి, మట్టి పాత్రల మధ్యలో మొగిలి! గేదె మీద సవారి చేస్తున్న పశువుల కాపరి!" ఆ ఫోటోలు చూసి అతను నిజంగానే ఆశ్చర్యపోయాడు.

"ఇంత జీవకళ ఉట్టిపడే ఈ చిత్రాలు నిజంగానే పోటీకి పంపు వేణు" అన్నాడు మాధవ.

"అవును పంపిస్తాను. తప్పకుండా ఈసారి నాకే బహుమతి వస్తుంది. అంతేకాదు. ఈ మొగిలి ఫోటోలు నా కళ్ళ ముందు నిలుపుకుంటాను. నా గుండెల్లో భద్రంగా దాచుకుంటాను?" ఆవేశంగా అంటున్న వేణు మాటలు విని మాధవ ఉలిక్కిపడ్డాడు.

గుండెల్లో ఫోటోలు దాచుకుంటే ఫరవాలేదులే అనుకున్నాడు మనస్సులో.

"ఆమెను ఆరాధిస్తున్నావా? ప్రేమిస్తున్నావా? పెళ్ళి చేసుకుంటావా? మోడల్‌గా పెట్టుకుని డబ్బు సంపాదిస్తావా?" వెంటనే అనేక ప్రశ్నలు వేసాడు మాధవ.

"ఇప్పుడు నేనేం చెప్పలేను? కాని ఆమె నాకు కావాలి?" అంటూనే వేణు ఆ ఫోటోలు తీసుకుని మొగిలి ఇంటివైపు బయలుదేరాడు.

అది గమ్యం లేని పయనంలా అనిపించింది మాధవకి.

"మొగిలీ! నీ ఫోటోలు చూసుకో! ఎంత అందంగా ఉన్నాయో" అంటూ సారె ముందు కూర్చుని కూజాలు తయారుచేస్తున్న ఆమె పక్కకు వెళ్ళి చూపించాడు.

మొగిలి ఆ ఫోటోలు చూసి ఆనందంతో ఉక్కిరి బిక్కిరయింది. వెంటనే చేస్తున్న పని ఆపి లేచి చేతులు కడుక్కు వచ్చింది. వేణు చేతుల్లోంచి ఆ ఫోటోలు తీసుకుని ఆతురతగా చూసింది. తన రూపం చూసుకుని మురిసిపోయింది. అదో పెద్ద అదృష్టంగా భావించింది. దానికి కారణం వేణు. ఆ సమయంలో తండ్రి, కోటి, సారె అన్నీ మరిచిపోయింది. ఆమె మనసు నిండా వేణూ అల్లుకుపోయాడు.

"ఇదిగో ఈ ఫోటోలు నీకే యిస్తా? అంతేకాదు దీంతో ఫోటోలు తియ్యడం నేర్పిస్తా! ఈ కెమేరా నీకే ఇస్తా?" అన్నాడు మురిపెంగా.

"ఆ దబ్బా నేనేం సేసుకోవాలి? తమరికాడే ఉండాలి?" సిగ్గుతో మెలికలు తిరిగింది మొగిలి.

"దీంతో ఈ తియ్యడం నేర్పిస్తా? నాతోరా?" అంటూ మురిపెంగా చెప్పాడు వేణు.

మేఘాలకు పురులు విప్పిన నాట్య మయూరిలా మొగిలి అతని వెంట అడుగులేసింది.

ఊరి చివర పంట పొలాల మధ్యలో అతని పక్కగా ఆమె నిలిచింది. ఆమె మెడ చుట్టూ చేతులు వేసి వేణు ఫోటోలు నొక్కడం నేర్పుతున్నాడు. అతని చేతుల స్పర్శకు ఆమె మెడే కాదు ఆమె శరీరమంతా పులకరించింది. అందుకే అతనికి మరింత దగ్గరగా జరిగింది. అంతకంటె మధురమైన సుఖమేదో అందుకోవాలని ఆమె మనసు తొందరపడింది. ఆ పంట చేలల్లో వేణు వెంట పరుగులు తీసింది మొగిలి. ఆ సమయంలో సామానుతో కావడి భుజాన తగిలించుకున్న మల్లన్న మొగిలిని చూసి కోపంతో మండిపోయాడు. పొరుగూరు వెళ్ళడం మాని యింటికి తిరిగి వచ్చాడు. అమాయకంగా ఉండే మొగిలి పట్నం బాబుని చూడగానే అలా మారిపోతుందని ఊహించుకోలేక పోయాడు. ఎండ చురుక్కుమంటోంది. ఇల్లు చేరిన మొగిలిని చూడగానే అతను కోపంతో రెచ్చిపోయాడు. తండ్రిని చూడకుండానే లోపలికి వెడుతున్న మొగిలిని పక్కనున్న దుడ్డుకర్రతో నడ్డిమీద ఒక్కటి వేసాడు.

"నాయనా? అయ్యో! కొట్టబోకే?" అంటూ అరుస్తున్న మొగిలి ఆర్తనాదానికి పక్కనున్న జనం పరుగులు పెట్టుకువచ్చారు.

"మావా! కొట్టబోకే! సచ్చిపోతది?" అంటూ మామకు అడ్డుపడ్డాడు కోటి. అయినా మల్లన్న కొట్టడం ఆపలేదు. ఆ దెబ్బలు తట్టుకోలేక మొగిలి విరిగిన చెట్టులా నేలకూలింది.



అందరూ మల్లన్నను పట్టుకుని ఆపారు.

"సచ్చిపోద్దిరా?" అంటూ పిన్నమ్మ వచ్చి మొగిలిని ఇంట్లోకి తీసుకువెళ్ళింది. ఆ పూట పిన్నమ్మ మొగిలితోటే ఉంది. కాస్త గంజి కాచి తాగించింది. అన్నం వండి ఆ ముగ్గురికి పెట్టింది. ఆ సాయంకాలానికి మొగిలి కాస్త కోలుకుంది. వళ్ళంతా కమికి దెబ్బలే. కోపం తగ్గిన మల్లన్న కూతుర్ని చూసి బావురుమన్నాడు.

"మొగిలీ! నువ్వు సిన్నపిల్లవి కాయే! ఆ పట్నం బాబుతో నీకేం పని. ఆరిని నమ్మబోక- ఈయేల నీ సుట్టూ తిరుగుతారు. రేపటి పొద్దు మరోసోటికి పోతారే? మనం ఈ మట్టిని నమ్ముకున్నాం! మడిసిని కాదే? నువ్వు సేసే పనికి ఆ మట్టిని అందించేది ఆ కోటిగాడేనే! ఆడిని, నన్ను మోసం సేబోకే?" మల్లన్న గొంతు దుఃఖంతో పూడుకుపోయి ఇక మాట రాలేదు. కారే కన్నీళ్ళు పై బట్టతో తుడుచుకుంటూ అక్కడ నుంచి బయటకు వెళ్లిపోయాడు. కోటిగాడు దిగాలుగా గుమ్మం ముందే చతికిలబడి కూర్చున్నాడు.

"ఒసే! మొగిలీ! ఆ మగోరితో జర బద్రమే? ఆరి సెయ్యి తాకితే నీకు నెలతప్పుద్దే?" అంది మెల్లిగా.

"అదేటది?" ఆశ్చర్యంగా అడిగింది మొగిలి.

"అది అంతే? నువ్వు నీళ్ళు పోసుకుంటాయే! ఆడ, మగ కలిస్తేనే కదా పిల్లలు పుట్టేది? ఆరి కాడకి పోబోకే?" అంది పిన్నమ్మ కాస్త మొగిలిని భయపెట్టాలని.

నిజంగానే మొగిలి చాలా భయపడింది. "ఇగ! ఆరితో పోనే పోను!" అనుకుంది మనస్సులో. ఆ మాటే పిన్నమ్మకి చెప్పింది కూడ! ఆరోజల్లా ఎవరు సరిగా తిండి తినలేదు. ఆ రాత్రి ఎవరి కంటికి కునుకు సరిగా రాలేదు.

మల్లన్న దుడ్డుతో మొగిలిని కొట్టిన వార్త ఊరంతా గుప్పుమంది. మాధవకి తెలిసి ఆ యింటికి వెళ్ళవద్దని వేణుని మందలించాడు.

"వాళ్ళు తలుచుకుంటే నిన్ను చావగొడతారు జాగ్రత్త!" అంటూ వేణుని భయపెట్టాడు.

నాలుగు రోజులు వేణు అటు వెళ్ళలేదు. కాని మనస్సులో మొగిలిని చూడాలని ఉంది. ఆమెతో మాట్లాడాలని ఉంది. అయిదవ రోజు మొగిలిని చూడాలని ప్రయాణమయ్యాడు వేణు.

"వేణూ! ఎక్కడికి బయలుదేరావు? మొగిలితో సాంగత్యం నీ భవిష్యత్తుకే గొడ్డలి పెట్టురా? ఫోటోలు తీసావు బాగానే ఉంది. కానీ మీవాళ్లు ఆమెను పెళ్ళి చేసుకోడానికి అంగీకరించరు? ఆమెతో చనువు పెంచుకుని ఏం చేస్తావు? ఆమెను నాశనం చెయ్యకు! ఆలోచించుకో?" చెప్పవలసింది చెప్పాడు మాధవ.

"నేను మొగిలిని ప్రేమిస్తున్నాను. ఆమె నాకు కావాలి?" అంటూ వేణు బయటకు వెళ్లిపోయాడు.

మాధవ అతన్ని చూసి చాలా భయపడ్డాడు. పైగా అతని తల్లితండ్రులు తననే తిడతారని బాధపడ్డాడు. వెంటనే పోస్టాఫీసుకు వెళ్లి అతని తల్లితండ్రులకు చూచాయగా ఫోనులో చెప్పాడు. అతని మనస్సు కాస్త కుదుటపడి ఊపిరి పీల్చుకున్నాడు.

ఇంటి ముందు వేణూని చూడగానే మొగిలి మొదట చాలా భయపడింది. లోపలికి పరుగెత్తి తలుపులు మూయబోయింది.

"మొగిలి నన్ను చూసి భయపడకు. నేను నిన్ను పెళ్ళి చేసుకుంటాను. మావాళ్లు అంగీకరించకపోయినా నిన్ను నా దానిని చేసుకుంటా! నువ్వు లేనిదే నేనుండలేను. నిన్ను చూడనిదే నే బతకలేను. నన్ను నమ్ము. నా మాట విను" అంటూ దీనంగా పలికాడు.

మొగిలి మనస్సు వేణు మాటలకి అయస్కాంతంలా ఆకర్షితమయింది. వేయబోయిన తలుపులు తెరిచింది. తండ్రి ఇంట లేడు. మొగిలి మనస్సులో తిరిగి ఏవో తలపులు. సూర్యుని చూసిన కమలంలా ఆమె ముఖం వికసించింది. నిద్రలేచిన కోటి విస్తుబోయాడు. మొగిలి వేణు పిలుపుకి ముగ్ధలా అతని వెంట అడుగులేసింది.

"మొగిలా! ఎల్లబోకే నాయన తిడతడే! కొడతడే! మొగిలా!" అంటూ కోటి ఎంత చెప్పినా మొగిలి వినలేదు.

"నీ పని నువ్వు సేసుకో పో!" అంది విసుగ్గా! మొగిలి కంటికి కోటి ఆకారం వికారంగా కనబడింది. ఆ యిల్లు, ఆ పరిసరాలు వెగటుగా అనిపించాయి. తెల్లని సూటులో వేణు మన్మధునిలా కనిపించాడు. తండ్రి మాటలు అనాగరికంగా అనిపించాయి. వేణు రూపం తప్ప ఆమెకు మరేమీ కనపడ్డం లేదు.

గోదావరి ఇసుక తిన్నెల్లో దుబ్బుల మధ్యలో ఏకాంతంగా వేణు, అతని వడిలో మొగిలి. వేణు హస్తాలు ఆమె శరీరంలోని ప్రతి అణువును మీటుతున్నాయి. తీయని లోకాలలో తేలుతోంది ఆమె మనుస్సు.

''మొగిలే? నాయన వచ్చిండే?'' అన్న కేక భూమ్యాకాశాలను బద్దలు చేస్తూ వినబడింది.

మొగిలి ఉలిక్కిపడి వేణు కౌగిలి వదిలించుకుంది. కంగారుగా పమిట సర్దుకుని లేచి దుబ్బుల చాటు నుంచి బయటకు వచ్చింది. తండ్రి తిరిగి కొడతాడేమోనన్న భయంతో ఆమె శరీరం సన్నగా వణికింది. మారు మాటాడకుండా వేణు పిలుస్తున్నా వినిపించుకోలేదు. కోటి వెంట యింటి వైపు అడుగులు వేసింది. ఇంట్లో తండ్రి లేడు. కోటిని తిట్టిపోసింది మొగిలి.

వేణూకి ఫోటో పోటీలలో ప్రథమ బహుమతి వచ్చిందని టెలిగ్రాం వచ్చింది. పైగా తల్లి సీరియస్‌గా ఉంది, వెంటనే బయలుదేరమని టెలిగ్రాం కూడా వచ్చింది.

వేణు ఇంట్లో అడుగు పెట్టగానే మాధవ ఆ విషయాలు చెప్పి టెలిగ్రాములు చేతిలో పెట్టాడు. ఒకపక్క కొండంత సంతోషంతో, మరోపక్క అంతులేని దుఃఖంతో ఉక్కిరిబిక్కిరి అయ్యాడు. మాధవ ఎంత చెప్పినా వినకుండా బట్టలు సర్దుకుని వాళ్ళూరు బయలుదేరి వెళ్ళాడు. అతను వెళ్ళగానే మాధవ మనస్సు కుదుటపడింది.

వేణు ఊరు వదలి వెళ్ళిపోయాడని తెలిసి కోటి, మల్లన్న చాలా సంతోషించారు. అదే సమయమనుకున్న మల్లన్న కూతురు పెళ్ళి కోటి గాడితో జరిపించెయ్యాలను కున్నాడు. మొగిలి మాత్రం వేణు కనబడక విరహంతో విలవిల్లాడింది.

"కోటిగాడితో నీ మనువు జరిపించేత్తా!" అంటూ మల్లన్న పట్టువట్టాడు. మొగిలి కాదని పైకి అనలేకపోయింది. ఇంక వేణు వచ్చి పెళ్ళి చేసుకుంటాడనే ఆశ మనసులో సన్నగిల్లుతోంది. అతను వెళ్ళి పక్షం రోజులు దాటిపోయింది. మాధవ కూడా ఆమెకు మరి కనపడలేదు. మొగిలికి మనసులో ఏదో దిగులు పట్టింది. పక్కింటి పిన్నమ్మ కూడా కోటిని పెళ్ళి చేసుకోమని చెప్పింది. మల్లన్న ముహూర్తాలు పెట్టించాడు. మల్లన్న పెళ్ళాం గుర్తుకొచ్చి కళ్ళొత్తుకున్నాడు. పెళ్ళి దగ్గర పడుతోంది. పక్కింటి పిన్నమ్మకి మాత్రం మొగిలి ముఖంలో సంతోషం కనబడలేదు.

"ఏందే మొగిలీ! ఆ దిగులేందే? మనువు నీకేనా?" అంటు ఆమె పక్కన చేరి పిన్నమ్మ ఆప్యాయంగా ఆమె తల నిమురుతూ అడిగింది.

"తప్పు సేసినా పిన్నమ్మా? ఆ పట్నం బాబు నన్ను మోసం సేసిండు. నన్ను మనువాడతానని నన్ను తాకిండు. సేత్తో తడిమిండు. నెల తప్పుద్దేమో పిన్నమ్మా?" అంటూ పిన్నమ్మ మీద వాలి వెక్కివెక్కి ఏడ్చింది.

"ఓసి ఎర్రిదానా? సెయ్యి పడితేనే నెలతప్పుద్దా?" అంటూ మొగిలి చెవిలో సృష్టి రహస్యాన్ని వివరించింది. భార్యాభర్తల సంగమాన్ని వివరించి చెప్పి మొగిలి అమాయకత్వానికి పగలబడి నవ్వింది. ఆమెతో పాటే మొగిలి కూడా పకపకా నవ్వింది. మొగిలి మనస్సు తేలికపడింది.

''వేణు మోసం చేసాడు. మాట తప్పాడని నిర్ణయించుకుంది. బలవంతంగా అతని జ్ఞాపకాలు, అతని రూపం మనస్సులో చెరిపివేసింది. తనకు అన్నివిధాల కోటిగాడే జతగాడు అనుకుంది. వేణు వెళ్ళి నెల దాటింది.

ఆరోజే మొగిలి, కోటి పెళ్ళి. ఇల్లంతా పచ్చని తోరణాలతో కలకలలాడుతోంది. మొగిలి ముఖంలో పెళ్ళి కళ వచ్చింది.

ఆరోజే వేణు ఆ వూరు చేరుకున్నాడు. మాధవ చెబుతున్నా వినిపించుకోకుండా మొగిలి ఇంటికి బయలుదేరాడు. ఏం ప్రమాదం ముంచుకొస్తుందోనని మాధవ అతనిని వెంబడించాడు.

"మొగిలీ! మొగిలీ! నే వచ్చేశా! రా! రా!" అంటూ పిలిచాడు. ఆ యింటి ముందు సందడి అతనికి ఏమాత్రం పట్టలేదు.

మొగిలి వచ్చి అతని ఎదురుగా నిలబడింది. పెళ్ళి కూతురిలా ఉన్న మొగిలిని చూసి ఉలిక్కిపడ్డాడు వేణు.

"పట్నం బాబు! నేను మీ యెంట రాలేను. తమరికి నాకు ఆ నింగికి ఈ నేలకు ఉన్నంత తేడా ఉన్నది బాబూ! తమరి కాడ ఆ బొమ్మల డబ్బా నొక్కెయ్యడం నే పట్టేసినా? కాని తమరు ఈ సారె తిప్పలేరు. అదుసు తొక్కలేరు. అయినా మీ వోళ్ళు నన్ను మనువాడనియ్యరు. నేను తమరితో దొంగ బతుకు బతకలేను. ఇగ ఎల్లి రండి బాబూ!" అని మొగిలి గడప దాటి తిరిగి లోపలికి వెళ్ళిపోయింది. కోటి కోపం పట్టలేక ఓ రాయి తీసి వేణుపైకి విసిరాడు. అది అతని తలకు తగిలి గాయమై రక్తం చిమ్మింది. ఆకాశంలో పొంచి ఎగురుతున్న గద్ద కోడి పిల్లను తన్నుకుపోలేక దూరంగా వెళ్ళిపోయింది. కాట్ల కుక్కలు అరుస్తూనే ఉన్నాయి.

సన్నాయి మేళం మోగింది. మొగిలి మెడలో కోటి తాళి కట్టాడు. మాధవ మెల్లిగా వేణుని నడిపించుకుంటూ ఇల్లు చేరాడు.

"వేణూది గమ్యం చేరని పయనం" అనుకున్నాడు మాధవ.

## రాత్రి రాసిన కవిత్వం

రహస్యమేమీ లేదు నమ్మండి
పండగొస్తుంది కదా పద్యం రాద్దామని
రాత్రంతా విన్యాసాలు చేసి
నల్లని కాగితం మీద మిణుగురుల్లా
మెరిపించిన అక్షరాలు
తెల్లారేసరికి తెల్లగా ఇంకిపోయి
చుక్కల్లా ఆకాశమెక్కి వెక్కిరించాయి...

అతని అసలు పేరేదో తెలియదు
ఆమె నిజ రూపమేదో తెలియదు
అయినా వాళ్ళిద్దరూ వేర్వేరుగా
స్వప్నాలకు లిపి కూర్చి రచిస్తారట
స్వాప్నిక శక్తిని నిరూపిస్తారట
కవిత్వానికి రసాయన పరీక్షలు జరిపి
రంగూ రుచులతో ప్రకటిస్తారట!

క్యాలెండర్ తేదీల ననుసరించైనా
కవిత్వం రాసెయ్యాలని తెగ ఆరాటం
ఎంత సరంజామా అమర్చుకున్నా
కళ్ళ నుండి నీటి బొట్టు రాలదు
కలం నుండి అక్షరం ముక్క జారదు
ఊహల్లోని దృశ్యాలకు అగ్ని స్పర్శా
ఆత్మావలోకనం తోడవ్వాలి కదా

లోకం విచిత్ర వేదనాశాల
కవిత్వం మరణశయ్య మీద
విప్పారిన రెండు కళ్ళలోని తళుకా...
ఆసుపత్రిలో ముసురుకునే
ఘాటైన మందువాసనల నడుమ
మల్లెపూవంటి రెక్కల్తో
రేయింబవళ్లూ గిరికీలు కొట్టే
నర్సు పక్షాన ఈ కవిత్వం...!?
*(ఎందరో అజ్ఞాత 'అజంతా'ల కోసం)*

**-అనిశెట్టి రజిత**